## అన్నారం బరాజ్‌ను సందర్శించిన బ్యాంకర్ల బృందం



అన్నారం బరాజ్‌ను పరిశీలిస్తున్న బ్యాంకర్లు

మహదేవపూర్ (కాళేశ్వరం), అక్టోబర్ 23: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధిలోని అన్నారం బరాజ్‌ను బుధవారం బ్యాంక్ అధికారుల బృందం పరిశీలించింది. బరాజ్ సాంకేతిక అంశాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బరాజ్ అప్, డౌన్ స్ట్రీమ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో పీఎన్‌బీ, యూబీ, కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఐవోబీ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు మోహన్, శరత్, వివేక్, విక్రమ్ కన్నా, మనోజ్, జై ఉపాధ్యాయ, ప్రవీణ్ కుమార్ వర్మ, గాయత్రి, హర్జీత్ సింగ్, సత్యనారాయణ, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పైపు కింద నీటితోనే స్నానాలు, బట్టలు పిండడం, ప్లేట్లు కడుగుతున్న విద్యార్థులు

- సీఎం రాక.. పలుమార్లు వాయిదా పడిన కార్యక్రమం
- కేసీఆర్ హయాంలో రూ. 85.10 కోట్లతో శ్రీకారం
- ఓరుగల్లులో రవీంద్రభారతి కంటే విశాలమైన భవనం
- సకల హంగులతో నిర్మాణం పూర్తిచేసుకున్న కళా కేంద్రం




కాళోజీ కళా క్షేత్రం

# వచ్చేదెన్నడు.. తెరిచేదెప్పుడు?

### ప్రారంభానికి ఎదురుచూస్తున్న కాళోజీ కళా క్షేత్రం

వరంగల్, అక్టోబర్ 23(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వారసత్వ, చారిత్రక, సాంస్కృతిక రంగాల్లో ఓరుగల్లుకు ఉన్న గుర్తింపును మరింత పెంచేలా కేసీఆర్ ప్రభుత్వం వరంగల్‌లో తలపెట్టిన కాళోజీ కళా క్షేత్రం నిర్మాణం దాదాపు పూర్తయ్యింది. సకల హంగులతో సిద్ధమై ముఖ్యమంత్రి రాక కోసం ఎదురుచూస్తున్నది. గత నెల 9న కాళోజీ జయంతి సందర్భంగా ప్రారంభించాలని ప్రభుత్వం భావించగా, సీఎం రేవంత్ రెడ్డి రాకపోవడంతో వాయిదా పడింది. ఆ తర్వాత అక్టోబర్ 2న ప్రారంభించాలని నిర్ణయించినప్పటికీ సీఎం పర్యటన లేకపోవడంతో మళ్లీ వాయిదా పడింది. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఆధ్వర్యంలో కాళోజీ కళా క్షేత్రం పనులు పూర్తయ్యాయి. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి కంటే విశాలంగా వరంగల్ నగరంలోని కాళోజీ కళా క్షేత్రాన్ని నిర్మించారు. హనుమకొండ బస్టాండ్ సమీపంలోని కుడా మైదానంలో 4.25 ఎకరాల్లో కళాక్షేత్రం నిర్మాణం జరిగింది. ఈ భవనాన్ని 1.39 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో విభిన్న శైలిలో నిర్మించారు. వరంగల్ నగరానికి మరింత శోభను అద్దేలా, సాంస్కృతిక కేంద్రంగా ప్రతిష్ట పెంచేలా భవనం డిజైన్ ఉన్నది. నాలుగు అంతస్థుల సువిశాల భవనంలో 1500 సీటింగ్ సామర్థ్యంతో ఒక ఆడిటోరియంను నిర్మించారు. మినీ మీటింగ్ హాల్, డైనింగ్ హాల్స్, వీఐపీ సూట్స్‌ను అత్యాధునికంగా ఏర్పాటు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు మేకప్ రూములు, ఆర్ట్ గ్యాలరీలున్నాయి. గ్యాలరీని కూర్చొని చూసేందుకు వీలుగా ఫ్రీ ఫంక్షన్ లాబీని ఏర్పాటు చేశారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాలుగు హైకెపాసిటీ లిఫ్టలను బిగించారు.

**కేసీఆర్ హయాంలో నిర్మాణం..**

పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది.. అని రాయడంతోపాటు ఆచరించి జీవితాంతం తెలంగాణ కోసం పని చేసిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరుతో వరంగల్ నగరంలో కళా క్షేత్రం ఉండనున్నది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పనిచేసిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు శతజయంతి ఉత్సవాలు 2014లో నిర్వహించిన నేపథ్యంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్‌లో 'కాళోజీ కళా క్షేత్రం' నిర్మించాలని నిర్ణయించారు. ఆయన జయంతి రోజైన సెప్టెంబర్ 9న కేసీఆర్ స్వయంగా వరంగల్‌కు వచ్చి భూమి పూజ చేశారు. మొదట రూ.15 కోట్లతో ఎకరంలోనే నిర్మించేలా అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ఆ మేరకు శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక, సాహిత్య రంగాల్లో వరంగల్‌కు ఉన్న ప్రత్యేకతను దృష్టిలో పెట్టుకుని కాళోజీ కళా క్షేత్రం భవనం డిజైన్‌లో కేసీఆర్ మార్పులు చేశారు. హనుమకొండలోని కుడా మైదానం (పాత హయగ్రీవాచారి కాంపౌండ్)లో 4.25 ఎకరాల్లో నాలుగు అంతస్తులతో కళా క్షేత్రం నిర్మించేందుకు నిర్ణయించారు. ఇందుకోసం రూ. 85.10 కోట్లు కేటాయించడంతో రాష్ట్రంలోనే అతి పెద్ద కళా క్షేత్రం భవన నిర్మాణం వరంగల్‌లో పూర్తయ్యింది. కాళోజీ కళా క్షేత్రం పనులను మొదట్లో సాంస్కృతిక, పర్యాటక శాఖకు అప్పగించగా, కరోనా కారణంగా మూడేండ్లు పనులు నెమ్మదిగా సాగాయి. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ 2022లో సమీక్షించి కుడా నిధులతో పనులు పూర్తి చేయాలని ఆదేశించడంతో అప్పటి నుంచి పనులు వేగంగా జరిగి ప్రస్తుతం సకల సౌకర్యాలతో ప్రారంభానికి సిద్ధమైంది.

# గురుకులం.. సమస్యల నిలయం

- అస్తవ్యస్తంగా మరుగుదొడ్లు
- కాలకృత్యాలకు రోడ్డెక్కాల్సిందే..
- తాగునీటికి తండ్లాటే

### నిర్లక్ష్యపు నీడలో గిరిజన ఆశ్రమ పాఠశాల

*ఐటీడీఏకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నబోయినపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల సమస్యల నిలయంగా మారింది. కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న మరుగు దొడ్లతో కాలకృత్యాలకు అడవి బాట పడుతున్నారు. ఆర్‌వో ప్లాంట్ మూలన పడడంతో తప్పని పరిస్థితుల్లో బోర్ వాటర్‌ను తాగుతున్నారు. స్నానం చేసేందుకు కనీసం ఫ్లోరింగ్ కూడా సరిగా లేక కష్టాలు పడుతున్నారు. వెంటనే ఐటీడీఏ అధికారులు స్పందించి గురుకులంలో వసతులు కల్పించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.*

*- ఏటూరునాగారం, అక్టోబర్ 23*

పేరుకే ఆశ్రమ పాఠశాల అయినప్పటికీ సమస్యలతో చదువులు సాగిస్తున్నారు. సుమారు 400 మందికిపైగా విద్యార్థులకు మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో ఆరు బయట అడవిలోకి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. టాయిలెట్స్, మరుగుదొడ్ల బ్లాక్ ఒక్కటి ఉంది. ఇందులో 12 మరుగుదొడ్లు ఉండగా ఒక్క దానికి మాత్రమే డోర్ ఉండగా, నీటి సరఫరా లేకపోవడం తో వినియోగించడం లేదు. తెల్లవారుజామునే అడవిలోనే కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. కనీసం విద్యా సంవత్సరం ప్రారంభంలోనే సమస్యలు తీర్చాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారు. ఆర్‌వో ప్లాంట్ మోటరు చెడిపోవడంతో మూలన పడింది. మోటరు బోరు వాటర్‌ను తాగుతుండగా, చిలుముతో కూడిన నీళ్లు వస్తున్నాయని విద్యార్థులు పేర్కొంటున్నారు. స్నానాలు చేసే ప్రాంతంలో కనీసం ఫ్లోరింగ్ కూడా లేకపోవడం గమనార్హం. ఈ ప్లాట్ ఫాం దగ్గరకు వెళ్లేందుక పక్కనే విద్యుత్ వైర్లు ఉన్నాయి. అవి అడ్డుగా ఉన్నాయి. ఎప్పుడు షాక్ కొడుతాయో తెలియకుండా ఉంది. పాఠశాల ఆవరణలో ఉన్న భవానికి విద్యుత్ సరఫ రా కూడా సక్రమంగా లేదు. దీంతో ఫ్యాన్లు, ట్యూబులైట్లు కాలిపోతున్నాయి. కింద బ్లాక్‌కు తాత్కాలికంగా కరెంట్ సరఫరా చేయగా పైన ఉన్న బ్లాక్‌లకు విద్యుత్ వెలుగులు లేవు. ఉపాధ్యాయుల నివాస గృహాల్లో సైతం సరైన సౌకర్యాలు లేకుండా ఉన్నాయి. నాలుగు నెలల క్రితం చేపట్టిన స్వాగత తోరణం పనులు కూడా నిలిపివేశారు. స్టీమ్ కుకింగ్ పరికరాలు మసి పట్టి పనికి రాకుండా పోయాయి. జాతీయ రహదారి పక్కనే ఐటీడీఏకు అత్యంత సమీపంలో ఉన్న ఈ పాఠశాల దయనీయ స్థితిలో ఉంటే మారుమూల గ్రామాల్లో ఉన్న పాఠశాల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. గిరిజనుల అభివృద్ధి ఏమో కానీ గిరిజన పిల్లలు చదివే పాఠశాలు అధ్వానంగా ఉండడం పలు విమర్శలకు తావిస్తోంది. పాఠశాలకు ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో లోవోల్టేజీ సమస్య వేధిస్తోంది. ఎన్నో సమస్యలతో విద్యార్థులు చదువుకునేందుకు కష్టాలు పడుతున్నారు. చివరకు ఉపాధ్యాయులు కూడా ఏమీచేయలేని పరిస్థితి ఉంది. వెంటనే ఐటీడీఏ అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.



అసంపూర్తిగా పాఠశాల ముఖద్వార గేటు



డోర్లు లేక అస్తవ్యస్తంగా ఉన్న మరుగుదొడ్లు



## రోడ్డు ఇలా.. పాఠశాలకు వెళ్లేదెలా?

**చెరువు నీటిలో నుంచే విద్యార్థుల రాకపోకలు**

మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం జయ్యారం ఉన్నత పాఠశాలలో చదువుతున్న మన్నెగూడెం, మంగోరిగూడెం గ్రామాల విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రామసముద్రం చెరువుకట్ట తెగిపోయి మన్నెగూడెం, మంగోరిగూడెం మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్లే రహదారి దెబ్బ తినడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు కొన్ని వారాలపాటు పాఠశాలకు వెళ్లలేదు. ప్రస్తుతం చెరువు నీటిలో నుంచి సైకిళ్లను నెట్టుకుంటూ పాఠశాలకు పోవాల్సిన దుస్థితి నెలకొంది. వ్యవసాయదారులు, కూలీలకూ తిప్పలు తప్పడం లేదు. పొలాల వద్దకు వెళ్లాలంటే కిలోమీటర్ల దూరం తిరగాల్సి వస్తున్నది. చెరువు కట్టకు గండిపడి రెండు నెలలు కావస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రహదారిని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

– చిన్నగూడూరు, అక్టోబర్ 23

## అండర్-23 క్రికెట్ విజేత హనుమకొండ



హనుమకొండ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న శ్రీనివాస్, ఉదయభానురావు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 23 : హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీ సుఖాంత్ క్రీడామైదానంలో ఈ నెల 20 నుంచి జరుగతున్న ఉమ్మడి ఆరు జిల్లాల అండర్-23 క్రికెట్ పోటీల్లో హనుమకొండ జట్టు విజేతగా నిలిచింది. బుధవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘు బాధ్యులు టోర్నమెంట్ విజేత హనుమకొండ, రన్నర్ మహబూబాబాద్ జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హనుమకొండ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 122 పరుగు చేసింది. మహబూబాబాద్ జట్టు 16 ఓవర్లలో 64 పరుగులకే ఆలౌట్ అయి ఓటమి చవిచూసింది. అనంతరం వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. వరంగల్ కేంద్రంగా నవంబర్‌లో జరిగే అండర్-23 అంతర్ జిల్లాల పోటీల్లో ఉమ్మడి వరంగల్ జట్టును విజేతగా నిలపాలని సూచించారు. సంయుక్త కార్యదర్శి ఉపేందర్, ఈసీ బాధ్యులు తోట రాము, మట్టెడ కుమార్, మహబూబాబాద్ జిల్లా క్రికెట్ ఇన్‌చార్జి అజయ్ సారధి, మాజీ కార్యదర్శి ఉదయ్‌భానురావు, బండారి ప్రభాకర్ , వరంగల్ రంజీ ప్లేయర్ సుఖాంత్ పాల్గొన్నారు.

## క్రెచ్ సెంటర్లను ప్రారంభించొద్దు

- విధి విధానాలను వెంటనే వెల్లడించాలి
- డీడబ్ల్యూవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ధర్నా



డీడబ్ల్యూవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ములుగురూరల్, అక్టోబర్ 23 : క్రెచ్ సెంటర్ల విధి విధానాలు వెంటనే వెల్లడించాలని, అప్పటి వరకు సెంటర్ల ప్రారంభం నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బుధవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు జిల్లా కేంద్రంలోని డీడబ్ల్యూవో కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సరోజన, సమ్మక్క మాట్లాడుతూ ధర్నా వద్దకు డీడబ్ల్యూవో వచ్చి తమను బుజ్జగించే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. క్రెచ్ సెంటర్ల విధివిధానాలు రానప్పుడు సెంటర్లను ప్రారంభించడాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేసినట్లు వారు తెలిపారు. కాగా, హైదరాబాద్‌లో గురువారం జేడీతో చర్చలున్న నేపథ్యంలో ఆందోళన విరమించాలని ములుగు సీఐ, ఎస్సై సూచించడంతో తాత్కాలికంగా ఆందోళన విరమించారు.

కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, అంగన్‌వాడీలు జమునారాణి, పద్మారాణి, రమాదేవి, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, సూరమ్మ, ప్రేమకుమారి, వెంకటరమణ, సరిత, నర్సమ్మ, పార్వతి, రేణుక, విజయ, పుష్ప, ఇందిరా, రాంబాబు, దీప, లక్ష్మీకాంత, రుక్మిణి, వెంకటేశ్వరీదేవి, రజిత, పార్వతి, నర్సమ్మ, రమలతోపాటు 350 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.




హనుమకొండలోని కేయూ లైబ్రరీ ఎదుట నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

## జీవో 29పై విద్యార్థుల ఆందోళన

*కేయూ లైబ్రరీ ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన*

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 23 : రాష్ట్రంలోని గ్రూప్-1 ఉద్యోగాల భర్తీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం అభ్యర్థుల అవకాశాలను దెబ్బతీసే జీవో 29ని వెంటనే రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ నరసింహారావు డిమాండ్ చేశారు. పాత జీవో 55ను పునరుద్ధరించి, దాని ప్రకారమే ఉద్యోగాలు భర్తీ చేయాలని బుధవారం కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్లకార్డులతో విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాజకీయ భేషజాలాలకు పోకుండా గ్రూప్-1 అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయడానికి వెంటనే చర్చలు జరపాలన్నారు. లేనిపక్షంలో కాంగ్రెస్ సర్కారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, నరేశ్, చరణ్, వీరన్న, సూర్య, స్వాతి, పృథ్వీరాజ్, సంగీత, అనూష పాల్గొన్నారు.



వాజేడు : మండపాక 163 జాతీయ రహదారికి ఇరువైపులా నిలిపి ఉన్న ఇసుక లారీలు

## బాబోయ్.. ఇసుక లారీలు

- జాతీయ రహదారికి ఇరువైపులా నిలిపివేత
- వాహనదారులకు తప్పని తిప్పలు.. పట్టించుకోని అధికారులు

వాజేడు, అక్టోబర్ 23 : ములుగు జిల్లా వాజేడు మండలం మండపాక గ్రామ శివారు నుంచి గోదావరి బ్రిడ్జి వరకున్న హైదరాబాద్-భూపాలపట్నం 163 జాతీయ రహదారికి ఇరువైపులా బుధవారం ఇసుక లారీలను నిలిపి ఉంచారు. దీంతో వాజేడు, వెంకటాపురం, భద్రాచలం, ఛత్తీస్‌గఢ్‌తోపాటు ఏటూరునాగారం, హనుమకొండ వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిత్యం ఇక్కడ ఇసుక లారీలు నిలిపివేస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇక్కడ రహదారికి ఇరువైపులా ఉన్న బెల్టు షాపులు, హోటల్స్ నిర్వహిస్తుండడంతో అక్కడ లారీలు నిలుపుతున్నారు. ఈ రహదారిపై ఇప్పటికే పలు ప్రమాదాలు చోటుచేసుకొని పలువురు మృతి చెందారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బెల్ట్ షాపులను తొలగించడంతో పాటు రహదారికి ఇరువైపులా లారీలు నిలుపకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

## కాజీపేట మీదుగా దీపావళికి ప్రత్యేక రైళ్లు

కాజీపేట, అక్టోబర్ 23 : దక్షిణ మధ్య రైల్వే దీపావళి పండుగ సందర్భంగా దానాపూర్‌కు కాజీపేట మీదుగా పలు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది. సికింద్రాబాద్ -పాట్నా(07003) మధ్య ఈ నెల 26, నవంబర్ 2, 9 తేదీల్లో, పాట్నా- సికింద్రాబాద్ (07004) మధ్య ఈ నెల 28, నవంబర్ 4, 11వ తేదీల్లో, మౌలాలి- ముజాపూర్(07649) మధ్య ఈ నెల 28, నవంబర్ 4, 11వ తేదీల్లో, ముజాపూర్- లింగంపల్లి(07650) మధ్య ఈ నెల 30, నవంబర్ 6, 13వ తేదీల్లో, సనత్‌నగర్- సంత్రాగచ్చి(07069) మధ్య ఈ నెల 30, నవంబర్ 6వ తేదీల్లో, సంత్రాగచ్చి- సనత్‌నగర్(07070) మధ్య ఈ నెల 31, నవంబర్ 1వ తేదీలో నడుపుతున్నట్లు తెలిపారు. 07003/07004 నంబర్ల స్పెషల్ రైళ్లు జనగామ, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, సిర్‌పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, నాగపూర్, ఇటార్సీ, జబల్‌పూర్, కట్నీ, సట్నా, ప్రయాగ్‌రాజ్, ఛైకీ, దీన్‌దయాల్ ఉపాధ్యాయ, బక్సర్, ఆరా, దానాపూర్ రైల్వే స్టేషన్లల్లో ఆగుతుందని తెలిపారు. 07649/07650 నంబర్ల స్పెషల్ రైళ్లు జనగామ, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, సిర్‌పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, నాగపూర్, ఇటార్సీ, జబల్‌పూర్, కట్నీ, సట్నా, ప్రయాగ్‌రాజ్, ఛైకీ, దీన్‌దయాల్ ఉపాధ్యాయ, బక్సర్, ఆరా, దానాపూర్, పాటలీపుత్ర, సన్‌పూర్, హాజీపూర్ రైల్వేస్టేషన్లలో ఆగుతుందని తెలిపారు.

## ఏఎన్ఎం కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

మడికొండ, అక్టోబర్ 23 : తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏఎన్ఎం కోర్సులో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మడికొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం మేనేజర్ జయశ్రీ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన 18 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ మహిళా అభ్యర్థులకు ఉచిత భోజన వసతి అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25లోగా 7660022525/6లో సంప్రదించాలని కోరారు. టెన్త్, ఇంటర్ మెమోలు, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, తెల్లరేషన్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం, పాస్ పోర్ట్ ఫొటోలు(6), ప్రభుత్వ ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, 4నుంచి 12వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్స్, టీసీ తప్పని సరిగా ఉండాలని సూచించారు.



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

## దద్దరిల్లిన కలెక్టరేట్లు

*స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు విద్యార్థుల ఆందోళన*

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కలెక్టరేట్లు విద్యార్థుల ఆందోళనలతో దద్దరిల్లాయి. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి సర్కారు విద్యారంగ అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో వేలాది మంది పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారన్నారు.తక్షణమే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ విద్యార్థుల కాస్మొటిక్ చార్జీల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27లోపు బకాయిలు విడుదల చేయకపోతే హైదరాబాద్‌ను దిగ్బంధిస్తామని, అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజా ప్రతినిధుల ఇండ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు.

## పారా మెడికల్ కోర్సులకు నోటిఫికేషన్

వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 23: పారా మెడికల్ కోర్సుల ప్రవేశాలకు వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ) నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేసింది. డీఎంఎల్‌టీ, డీఏఎన్ఎస్, డీ కార్డియో, డీఆర్‌జీఏ, డీడీఆర్ఏ, డీఈసీజీ, డీ డయాలసిస్, డీఎంఎస్‌టీ, డీఎంఐటీ, డీవోఏ, డీఈపీటీతో పాటు పలు కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్వీయ ధ్రువీకరణతో విద్యార్హతల ప్రతులను దరఖాస్తుకు జత పర్చాల్సి ఉంటుందన్నారు. సమాచారం కోసం www.tgpmb.telangana.gov. in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.